


(నెలనెలా ఓ పుస్తకం – సమగ్రపరిచయం)

# Heat and Dust /వేడి, దుమ్మూధూళి



రూత్ ప్రావెర్ ఝబ్‌వాలా (మే 7, 1927 –April 3, 2013) జర్మనీలో– పోలిష్ యూదుల కుటుంబంలో పుట్టి, ఇంగ్లండ్లో చదువుకున్నారు. 1948లో బ్రిటిష్ పౌరురాలయ్యారు. 1951లో భారతదేశానికి వచ్చి, భారతీయ పార్సీ ఆర్కిటెక్ట్ అయిన సైరస్ ఎస్ ఎచ్ ఝబ్వాలాని పెళ్ళి చేసుకుని, కొత్త ఢిల్లీలో 24 సంవత్సరాలున్నారు. ఎనిమిది నవళ్ళు, 23 స్క్రీన్ ప్లేలు, మూడు కథా సంకలనాలూ రాశారు. ఆమె రచనల్లో అధికభాగం సమకాలీన భారతదేశం గురించినవే.


ఝబ్‌వాలా ప్రప్రథమ నవల, 'టు హూమ్ షి విల్' 1955లో అచ్చయింది. 1960లో ఆమె రాసిన 'హౌస్ హోల్డర్' ఆధారంగా జేమ్స్ ఐవరీ, ఇస్మాయిల్ మర్చంట్ కలిసి, 1963లో సినిమా తీశారు. ఆమె ఎనిమిదవ నవలైన 'హీట్ అండ్ డస్ట్'కి 1975లో బుకర్ ప్రైజ్ పొందారు. దీని ఆధారంగా మళ్ళీ మర్చంట్ ఐవరీ ప్రొడక్షన్స్, జేమ్స్ ఐవరీ దర్శకత్వం కింద తీసిన సినిమా, 1983లో జనవరి 1న విడుదల అయింది. స్క్రీన్ ప్లే రాసినది రచయిత్రే. ఆ సంవత్సరమే ఆమె న్యూయార్క్ వెళ్ళిపోయి 'ప్లేస్ ఆఫ్ పీస్' రాసి, మరణించేవరకూ అక్కడే నివసించారు. దీన్ని కూడా సినిమాగా తీసినప్పుడు, ఝబ్‌వాలాయే స్క్రీన్ ప్లే రాశారు.

బుకర్ ప్రైజూ, ఆస్కారూ పొందిన మొదటి మహిళ ఈమె. ఝబ్‌వాలా తన మొదటి 'అకాడెమీ అవార్డ్' 'ఎ రూమ్ విథ్ ఎ వ్యూ' స్క్రీన్ ప్లే (1986) కి పొందారు. రెండవది ఆరేళ్ళ తరువాత 'హొవర్డ్స్ ఎండ్'(1986) కి. ఝబ్‌వాలా రాసినవాటిల్లో ఆఖరి కథ 'ద జడ్జెస్ విల్' 'ద న్యూయోర్కర్' లో, మార్చి 25న, 2013లో పబ్లిష్ అయింది. ఆమె స్క్రిప్టులు కొన్ని వివాదం సృష్టించాయి.

★★★

నవలికలో, రెండు సమానాంతరమైన కథలు కొనసాగుతాయి. ఒకటి వర్తమానానికి చెందినది. రెండవది గతంలో జరిగినది. ఒక పేరుండని 'నేను' అని పుస్తకమంతా ఉన్న అందమైన బ్రిటిష్ యువతి, తన తాతగారి మొదటి భార్య ఒలివియా జీవితం గురించి తెలుసుకోడానికి, 1970లో ఇంగ్లండ్ నుండి భారతదేశం వస్తుంది. కథకురాలు ఆమే. ఒలివియా తన అక్క మార్షియాకి రాసిన ఉత్తరాలు ఆమె వద్ద ఉంటాయి.

ఒలివియా– సతీపుర్‌లో అసిస్టెంట్ కలెక్టర్ అయిన డగ్లస్ రివర్స్‌ని 50 ఏళ్ళ కిందట 1923లో బ్రిటన్లో పెళ్ళి చేసుకుని, భర్తతోపాటు ఆ ఊరికి వస్తుంది. జంట సఖ్యతగా ఉండి, ప్రేమతో జీవితం గడుపుతుంటారు. డగ్లస్ ఆఫీసు పనులమీద ఎప్పుడూ బయట తిరుగుతూ ఉంటాడు. ఒలివియాకి చుట్టుపక్కల ఉండే బ్రిటిష్ స్త్రీలతో సమయం గడపటం అంటే చిరాకు. ఒంటరిగా పియానో వాయిస్తూ, ఎంబ్రాయిడరీ చేస్తూ– వేడీ దుమ్మూ ఇంట్లోకి ప్రవేశించకుండా తలుపులూ, కిటికీలూ బిగించుకు కూర్చుంటుంది.




ఒక రాత్రి ఖతమ్ అన్న ఊర్లో ఉండే యువరాజైన 'నవాబ్' ఇంట్లో డిన్నర్ పార్టీకి ఆహ్వానం రావడంతో, అక్కడుండే బ్రిటిషర్లందరితో పాటు భర్తతో కూడా వెళ్తుంది. మతి స్థిమితం లేని నవాబ్ భార్య సాండీ, ఒక స్విజర్లాండ్ క్లినిక్లో ఉంటుంది. ఆ పార్టీలో నవాబుకీ ఒలివియాకీ మధ్య ఆకర్షణ తలెత్తుతుంది. ఒలివియా ఆశించినట్టే, కొద్దిరోజుల తరువాత నవాబు తన మందిమార్బలంతో పాటు ఆమె ఇంటికి వచ్చి గడుపుతాడు. ఇద్దరి సంబంధమూ స్నేహంతోనే ప్రారంభం అయినప్పటికీ, ఆ తరువాత ఇద్దరూ ప్రేమికులవుతారు. ఇదంతా, డగ్లస్ లేనప్పుడు జరుగుతుంది.

ఒలివియా గర్భం దాల్చినప్పుడు, పుట్టబోయే బిడ్డకి తండ్రి భర్తో, నవాబో తేల్చుకోలేకపోతుంది. అయితే, వాళ్ళిద్దరూ కూడా తండ్రి తానే అనుకుంటారు. నవాబు తల్లి సహాయంతో ఒలివియా గర్భవిచ్ఛిత్తి చేయించుకుంటుంది. ఈ వార్త సతీపుర్ ఆంగ్లో–ఇండియన్ కమ్యూనిటీలో కార్చిచ్చులా వ్యాపిస్తుంది. ఒలీవియా భర్త ఆమెకి విడాకులిచ్చి మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు.

ఆ తరువాత నవాబ్ ఆమె కోసం హిమాలయాల వద్దనున్న చిన్న X అనే ఊర్లో ఇల్లు కొని, అటు తరువాత ఆమె గురించి బయట ఎక్కడా మాట్లాడడు. ఆ కొండలెక్కడానికి/ఎక్కించబడటానికి వీలవనంత లావుగా అయేవరకూ, నవాబ్ ఆమెకోసం అక్కడికి వెళ్తూ ఉండి, ఆర్థిక ఇబ్బందులని ఎదురుకుంటూ, తల్లి చేతుల్లో ప్రాణాలు విడుస్తాడు. అతని మరణం తరువాత ఒలివియా ఆరేళ్ళు భారతదేశంలోనే ఉండి, 1950లో మరణిస్తుంది. హిందూ మతం పుచ్చుకోనప్పటికీ అంత్య క్రియలు హిందూ రీతిలోనే జరగాలన్న ఆమె కోరిక ప్రకారం, అక్కడున్నవారు మృతదేహాన్ని దహనం చేసి, చితాభస్మాన్ని కొండల చుట్టూ చల్లుతారు.

పాతికేళ్ళ తరువాత కథకురాలు భారతదేశంలో ప్రవేశించి– ఒలీవియా, డగ్లస్ ఒకానొకప్పుడు ఉండే ఇంటిని చూడ్డానికి వెళ్తుంది. అది అప్పటికే కొన్ని సర్కారీ ఆఫీసుల కిందకి విభజింపబడుతుంది. వాటిల్లో ఒకదాన్లో ఇందర్‌లాల్ అనే యువకుడు క్లర్కుగా పని చేస్తుంటాడు. అతను తల్లి, భార్యా, తన ముగ్గురి పిల్లలతో పాటు ఉంటాడు. కథకురాలికి తన చిన్న ఇంట్లో ఉండేందుకు చోటిస్తాడు. ఆమె భారతీయ వస్త్రధారణని అలవరచుకుని, హిందీ నేర్చుకోవడం మొదలెడుతుంది. వేసవి ధాటికి తట్టుకోలేక రాత్రివేళలు మిగతావారిలాగే, పెరట్లో మంచం మీద పడుక్కుంటుంది.
ఆమె నవాబ్ రాజమందిరానికి ఇందర్‌లాల్ తో పాటు వెళ్తుంది. ఒలివియా, నవాబ్ మొదట ప్రేమికులయిన బాబా ఫిర్దౌస్ స్మారక స్థలంలోనే ఇందర్ లాల్‌తో శృంగారంలో పాల్గొన్నప్పటికీ, ఆ సంబంధంలో ఆమెవైపు నుంచి ఏ భావానుబంధమూ ఉండదు. ఆ తరువాత, తను గర్భం ధరించిందని గ్రహిస్తుంది కానీ దాని గురించి ఎక్కువ సతమతపడదు.

బిడ్డకి కనడానికి, ఒలివియా ఉంటూ ఉండే X అన్న కొండ ప్రదేశంలో ఉన్న అదే ఇంటికి వెళ్ళి, దాన్ని వర్ణిస్తుంది:

*ఇక్కడ ఒలివియా పరిసర ప్రభావం ఇంకా ఉంది. ఒక పియానో ఉంది. సతీపుర్‌ది కాదేమో కానీ ఖతమ్ నుంచి నవాబు పంపిన గ్రాండ్ పియానో అయి ఉంటుంది… కర్టెన్లూ దిళ్ళూ పసుపు రంగుకి మళ్ళి, పీలికలై ఉన్నాయి. గ్రామఫోన్ ఉంది… కిటికీ అంచున ఎంబ్రాయిడరీ చేసే ఫ్రేమ్ ఒకటుంది.. ఇది అలంకారానికుందో లేక ఒలివియా అక్కడ కూర్చుని కుట్టుకుంటూ, కొండలని చూస్తూ ఉండేదో తెలియదు నాకు.*
కథకురాలు బజార్లో బట్టల దుకాణం పైన ఉన్న ఒక గదిలో బిడ్డని కంటుంది. తిరిగి మరేనాడూ కొండ దిగదు.

★★★

స్వంతంత్రానికి ముందప్పటికీ, పిమ్మటి కాలంలోనూ ప్రజల ఆలోచనాధోరణిలో ఎంత మార్పు వచ్చిందో అని రెండు సమానాంతర కథలూ కనపరుస్తాయి. నవలికలో ఒక అధ్యాయం ఒలివియా గురించైతే, రెండోది కథకురాలి గురించినది. ఇద్దరి జీవితాలకీ మధ్య ఎన్నో పోలికలున్నప్పటికీ,

తీసుకున్న నిర్ణయాలు మాత్రం భిన్నమైనవి. మనస్తత్వాలలో తేడాలుంటాయి. ఇద్దరూ ఖతమ్ ప్రాంతంలోనే నివసించినప్పటికీ, కాలాలు వేర్వేరువి కనుక జీవన శైలుల్లో అంతరం ఉంటుంది. పుస్తకంలో అనేకమైన ఇతర చిన్న పాత్రలుంటాయి.

*నవల చివర్న కథకురాలు చెప్తారు: 'ఒలివియా విలక్షణమైన స్త్రీ అని నేను అనుకోను. ఆమెలో ఏ ప్రత్యేక లక్షణాలూ లేవు. ఆమె మొదట ఇక్కడికి వచ్చినప్పుడు ఎలా ఉండేదో, అదే ఆమె అసలు తత్వం అయింటుంది. అందమైన అహంకారి. తన సంతోషమే తనకి ముఖ్యం. తన్ని ముక్కోపి అని కూడా అనవచ్చునేమో... అయినప్పటికీ, అటు పిమ్మటి ఆమె చర్యలనీ, వాటికి జీవితాంతం కట్టుబడి ఉండటమూ చూస్తే, ఇక్కడికి వచ్చినప్పుడు ఆమె ఎలా ఉండేదో అలాగే మిగిలి ఉండడం అయితే సాధ్యం కాదు. కాకపోతే, ఆ తరువాత ఆమె ఎలా మారిందన్న సంగతుల గురించిన ఏ రికార్డూ మా కుటుంబంలో కానీ నాకు తెలిసినంత మట్టుకు ఇంకెక్కడా కానీ లేదు. నాకింకా ఎక్కువ తెలుసుకోవాలని ఉంది కానీ తెలుసుకోడానికి ఉన్న ఒకే దారి ఆమె చేసినట్టే నేనూ చేయడం: ఇక్కడే ఉండిపోవడం.'*

కథకురాలికి మొదట ఇండియా పరాయి దేశం అనిపించినప్పటికీ గ్రామాలూ, అతిధులకిచ్చే గౌరవం నచ్చుతాయి. ఆమె గురించిన కథకన్నా ఒలివియా జీవితం ఎక్కువ ఆసక్తికరంగా అనిపిస్తుంది.

నవలిక యాధాలాపమైన శైలితో, స్పష్టంగా ఉంటుంది. పాఠకులు వినడమే తప్ప ఇంక చూడలేకపోయే గతించిపోయిన కాలానికి రచయిత్రి తీసుకెళ్తారు. 180 పేజీల ఈ నవలిక– వలస యుగంలో ఇండియాని తమ దేశంగానే చేసుకున్న బ్రిటిష్ ఉన్నతవర్గాల జీవితాల గురించి చెప్తుంది. వారి వృథాకాలక్షేపాన్నీ, వారి బడాయినీ రచయిత్రి నిర్మొహమాటంగా వర్ణిస్తారు.

ఆంగ్లేయుల పరిపాలన కాలం గురించి బ్రిటిష్ యువతి దృష్టికోణంతో వచ్చిన మొట్టమొదటి కథ ఇది. పూర్తి పుస్తకంలో మండుతున్న ఎండల వేసవికాలం, దుమ్ముతుపానూ– వాటి వల్ల ఆంగ్లేయులకి కలిగే మానసిక స్తబ్ధతా కనిపిస్తాయి.

సినిమా లింక్ : https://www.youtube.com/watch?v=2lH9-eBAyjs

COMMENTS